www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 1-5-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 15

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ.11:24 తదుపరి పంచమి; నక్షత్రం: మృగశిర మ. 2:21 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.10.18-11.48, దుర్ముహూర్తం: ఉ.10.05-10.56, మ.3.09-4.00, అమృతఘడియలు: ఉ.6:15-7.44, తె 3.36-5.06, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.52, సూర్యాస్తమయం: 6.31

వికారాబాద్–మేడ్చల్

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కార్మికుల బతుకులు దుర్భరమే..

చట్టాల అమలుకు యాజమాన్యాల తిలోదకాలు

పని ప్రదేశాల్లో కనిపించని సేఫ్టీ ప్రికాషన్స్

పట్టించుకోని కార్మిక శాఖ అధికారులు

ఆగని కార్మికుల శ్రమదోపిడీ!

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం



3

రాత్రింబవళ్లు యంత్రాల మధ్య పనిచేస్తూ ప్రజలకు వినియోగ వస్తువులను తయారు చేస్తున్న కార్మికుల బతుకులు నానాటికీ దుర్భరంగా మారుతున్నాయి. ప్రతీ సంవత్సరం ప్రపంచ కార్మిక దినోత్సవం(మే డే)ను జరుపుకుంటున్నా.. వారి జీవితాల్లో మార్పు కనిపించడం లేదు. కనీస వేతనాలు ఉండవు.. సౌకర్యాలు, భద్రత కనిపించదు.. ఏళ్లకేళ్లుగా కార్మికుల శ్రమదోపిడే జరుగుతునే ఉంది. నేడు మేడే సందర్భంగా ప్రత్యేకం..



నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, తదితరులు

అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వరుడు

వికారాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను రూపుమాపడానికి కృషి చేసిన అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వరుడని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొనియడారు. బుధవారం ఆయన జయంతోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్నెపల్లిలో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ బసవేశ్వరుడి ఆధ్వర్యంలో ఆనాడే కులాంతర వివాహాలు జరిగాయని గుర్తు చేశారు. కులాల పేరుతో విడిపోకుండా అందరు కలిసి జీవించే విధంగా హైందవ మతాన్ని సంస్కరించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ వీరశైవ సమాజం సొసైటీ నిర్మాణం కోసం రూ.21 లక్షలు ప్రకటించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, సంతోష్ కుమార్, రమేశ్, రాజశేఖర్ రెడ్డి, ముత్తాహర్ షరీఫ్, బస్వరాజ్, అప్ప విజయ్‌కుమార్, వీరేశం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా అధికారుల

ప్రథమ సంఘసంస్కర్త, సమతావాది

కలెక్టరేట్‌లో బసవేశ్వరుడికి నివాళి

వికారాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు మహాత్మా బసవేశ్వరుడని, అలాగే ప్రథమ సంఘసంస్కర్త అని కలెక్టర్ ప్రతీక్‌జైన్ కొనియాడారు. బుధవారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూఢనమ్మకాలపై నిరంతరం పోరాటం చేసిన మహానుభావుడు బసవేశ్వరుడు అన్నారు. బసవేశ్వరుని మార్గాన ముందుకు సాగాలని, సమాజ అభివృద్ధికి పాటు పడాలని కలెక్టర్ సూచించారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరిలతో కలిసి బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూఓ ఉపేందర్, డీఆర్డీవో శ్రీనివాస్, డీటీడీవో కమలాకర్ రెడ్డి, డీఎస్‌హెచ్ఓ సత్తార్, డీఎస్సీ డబ్ల్యూఓ మల్లేశం, అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో మరోసారి వికారాబాద్ జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల మాదిరిగానే ఈ ఏడాది కూడా రాష్ట్రంలో చివరి స్థానానికే పరిమితమైంది. 73.97 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 33వ స్థానంలో నిలిచింది. ఇలా చివరి స్థానంలో నిలవడం వరుసగా మూడోసారి కావడం గమనార్హం. జిల్లాలో మెరుగైన ఫలితాలు రాకపోవడానికి విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, 90.76 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా రాష్ట్రంలో 28వ స్థానంలో నిలిచింది.



పదిలో మరోసారి!

చివరి స్థానంలో 'వికారాబాద్' హ్యాట్రిక్

73.97 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 33వ స్థానం

ఆఖరి స్థానంలో నిలవడం ఇది మూడోసారి

ఫలితాల్లో బాలికలదే పైచేయి

మొత్తం 18 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

అధ్వాన ఫలితాలపై తీవ్ర విమర్శలు

90.76 శాతం ఉత్తీర్ణతతో 28వ స్థానంలో మేడ్చల్

వికారాబాద్ / మేడ్చల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగిన పదో తరగతి పరీక్షలకు జిల్లాలో మొత్తం 12,846 మంది విద్యార్థులు హాజరు కాగా, 9,502 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 6,405 మందిలో 4,469 మంది, బాలికలు 6,441 మందిలో 5,033 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 73.97 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, వారిలో బాలురు 69.77శాతం,

మిగతా 4వ పేజీలో...

	విద్యార్థులు	ఉత్తీర్ణత	ఉత్తీర్ణత శాతం
వికారాబాద్ జిల్లా	12,846	9,502	73.97
మేడ్చల్ జిల్లా	47,235	42,870	90.76

మేడ్చల్‌లో ప్రభుత్వ విద్యార్థులదే హవా 4

ఉత్తీర్ణతలో బాలికలు ముందంజ



హరిణి, 573/600, సంగం లక్ష్మీబాయి స్కూల్, వికారాబాద్



జె.చిన్మయి, 568/600, ఎంజేపీటీ గర్ల్స్ స్కూల్, పరిగి



తమన్నా, 565/600, మైనార్టీ గురుకులం, వికారాబాద్



సారిక, 562/600, సోషల్ వెల్ఫేర్, కొత్తగడి



జె.సోనియా, 579/600, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా



త్రివేణి, 572/600, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా



బీ.హారిక, 560/600, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా



వి.శివ, 558/600, సోషల్‌వెల్ఫేర్, ఎదులాబాద్

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం పదవుల పందేరానికి రంగం సిద్ధం చేసింది. దీంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక పరిశీలకులను నియమించింది. వారు పార్టీలోని అన్ని స్థాయిల నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలోనే బ్లాక్, మండల కమిటీల ఎంపిక పూర్తి చేయనున్నారు. కాగా, మండల, బ్లాక్, జిల్లా అధ్యక్ష పదవులపై నేతల్లో భారీ పోటీ నెలకొంది.

పదవుల పందేరం!

కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి

బ్లాక్, మండల, డీసీసీ అధ్యక్ష పదవులకు పోటీ.. జిల్లా అధ్యక్ష పీఠంపై సీనియర్ల కన్ను..

ప్రయత్నాలు ముమ్మరం చేసిన నేతలు.. 2017 నుంచి ఉన్న వారికే దక్కనున్న ప్రాధాన్యం

సీనియర్లతో పాటు మహిళలు, యువతకు పెద్దపీట.. ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న పదవుల కోలాహలం





రంగారెడ్డి అర్బన్/తాండూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాకు సీహెచ్ శివసేనారెడ్డి, సంతోష్ కుమార్ కోల్‌కొండ, దారసింగ్, వికారాబాద్ జిల్లాకు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, రాంసెట్టి నరేందర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు సీహెచ్ పారిజాత నర్సింహారెడ్డి, కొత్తకుర్మ శివకుమార్‌ను పరిశీలకులుగా నియమించింది. వీరు జిల్లా స్థాయి సమావేశాలను పర్యవేక్షించనున్నారు. త్వరలోనే బ్లాక్ కాంగ్రెస్, మండల స్థాయి అధ్యక్షులను ఎంపిక చేయనున్నారు. అలాగే మే 4 నుంచి 10వ తేదీ వరకు మండల కమిటీల ఏర్పాటు, మే 13 నుంచి 20 వరకు గ్రామ అధ్యక్షులను ఎంపిక చేయనున్నారు.

డీసీసీ పీఠంపై ఆసక్తి

కాగా, మండల, బ్లాక్ జిల్లా అధ్యక్ష పదవులపై నేతల్లో పోటాపోటీ నెలకొంది. ప్రధానంగా జిల్లా అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందనే ఆసక్తి క్యాడర్‌లో నెలకొంది. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొనడంతో అందరి దృష్టి డీసీసీపై పడింది. దీంతో కొందరు సీనియర్ నేతలు తమ అనుచరులను డీసీసీ పీఠాలపై కూర్చోబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష రేసులో అనేక

మిగతా 3వ పేజీలో...

సమీకరణాలు, సమర్థతే గీటురాయి

ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏఐసీసీ సభ్యులు, పీసీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల విస్తృత అభిప్రాయాలను పరిశీలకులు సేకరించి జాబితాను వడపోస్తారు. చివరికి తుది జాబితాను పీసీసీకి నివేదించనున్నారు. సామాజిక సమీకరణలు, నాయకుల సమర్థత, సీనియార్టీ, నియోజకవర్గాలు, ఆయా బ్లాక్, జిల్లాలో పరిస్థితులు, పార్టీ బలలోపేతానికి ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పదవులను భర్తీ చేయనున్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లాలోని ముఖ్య నాయకులు పదవులు దక్కించుకునేందుకు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా పార్టీ సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో సందడి మొదలైంది.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులుండొద్దు

» అన్ని సదుపాయాలు కల్పించాలి » వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం పౌర సరఫరాల శాఖ మంత్రి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 128 వరి ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను మొదలు పెట్టాలన్నారు. సదుపాయాలతో పాటు అవసరమైన తాడిపత్రిలు, సంచులు, తేమను పరీక్షించే యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. రైస్ మిల్లర్ల వద్ద బ్యాంక్ గ్యారెంటీలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డీఆర్డీవో శ్రీనివాస్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజస్, వ్యవసాయ శాఖ ఏడీఏ స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

పొన్నాల్‌ను అలియాబాద్ బల్దియాలో కలపాలి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

శామీర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామాన్ని మూడుచింతలపల్లి మున్సిపాలిటీ నుంచి తొలగించి అలియాబాద్ బల్దియాలో కలపాలని బుధవారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్ కలెక్టర్ గౌతమ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పొన్నాల్ గ్రామాన్ని గత నెలలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో కలిపినట్లు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. కాగా, ఈ విషయమై బుధవారం ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ అధ్యక్షుడు గడ్డం రమేశ్, కాంగ్రెస్ నాయకులు వజ్రేశ్ యాదవ్‌ను కలిసి ఆయనకు వివరించారు. అనంతరం ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వివరించారు. స్పందించిన మంత్రి గ్రామస్తులు కోరిన విధంగా పొన్నాల్‌ను అలియాబాద్ మున్సిపల్‌లోనే కలపాలని కలెక్టర్‌కు ఇవ్వాలంటూ ఒక లేఖను రాసి ఇచ్చారు. మంత్రి ఇచ్చిన ఆ లేఖను వజ్రేశ్ యాదవ్, పొన్నాల్ మాజీ ఉప సర్పంచ్ గడ్డం రమేశ్, కాంగ్రెస్ ఇతర నాయకులు కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్‌ను కలిసి అందజేశారు.

నేటి నుంచి చెత్త సేకరణకు ప్రత్యేక యాప్



పారిశుధ్య మెరుగుకు మంత్రి ఆదేశాలు

తాండూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మెరుగైన పారిశుధ్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలుచేయనుంది. మే 1 నుంచి గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణకు ప్రత్యేక 'యాప్'ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. తాండూరు పట్టణ ప్రాంతంలో జియోటెస్ట్ విధానం అమల్లో ఉంది. అందుకు భిన్నంగా గ్రామీణ ప్రాంతాలలో ఈ నూతన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా? లేదా? అనే వివరాల నమోదు చేసేందుకు ఈ యాప్‌ను ప్రారంభిస్తున్నామని ఇటీవల జరిగిన జెడ్పీసీఈవో, డీఆర్‌డీఓల వర్క్‌షాపులో మంత్రి సీతక్క ప్రకటించిన విషయం విధితమే. ఇందుకు సంబంధించి ఇంకా క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు అందలేవని మండల స్థాయి అధికారులు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ 3

పరీక్ష రాసి ఇంటికి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

మేడ్చల్ పీఎస్ పరిధిలో ఘటన 4

ఎరువులు, విత్తనాలు
అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు


ఫర్టిలైజర్ దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

చేవెళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు హెచ్చరించారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌కు ముందుగానే ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, విత్తనాలు అమ్మాలని, రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. రైతులు సైతం తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శంకర్‌పల్లి ఇన్‌చార్జి ఏవో సురేష్‌బాబు ఉన్నారు.

గొప్ప నాయకుడు మాజీ ప్రధాని వాజ్‌పేయి

మహేశ్వరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజాస్వామ్య విలువలను కాపాడిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మండల పరిధి నాగారంలో గల ఓ ఫామ్‌హౌస్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లమల్ల యాదీష్ అధ్యక్షతన నిర్వహించిన వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. వాజ్‌పేయి నైతిక విలువలకు కట్టుబడి ప్రభుత్వాన్ని తృణప్రాయంగా వదలుకొని, మళ్లీ ఎన్నికల్లోకి వెళ్లి గెలిచి ప్రధాని అయ్యారన్నారు. 'ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన'తో గ్రామాలకు రోడ్ల నిర్మాణం చేపట్టారని, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రతీ ఒక్కరు వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, జయప్రకాశ్, కాశీనాథ్, నళిని, ప్రేమ్‌రాజ్, నర్సింహారెడ్డి, శ్రీరాములుయాదవ్, అంజన్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌శర్మ, పాపయ్యగౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనాథ, పేద మహిళా అభ్యర్థుల నుంచి పలు డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా శిశు సంక్షేమాధికారి శ్రీలత తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో పలు డిప్లొమా కోర్సులను అందిస్తున్న నేపథ్యంలో అర్హులైన అనాథ, పేద మహిళా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులు చేసేందుకు 60సీట్లు ఉన్నాయని, వాటిల్లో అనాథలు, పాక్షిక అనాథలు, పేదలకు, ట్రాఫికింగ్‌కు గురైన అమ్మాయిలు, బాలికా సంరక్షణ కేంద్రంలోని అమ్మాయిల కోసం 70శాతం చొప్పున ఒక్కో కోర్సులో 42సీట్లు కేటాయించినట్లు వివరించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ నియమం ప్రకారం మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించినట్లు వెల్లడించారు. తెలంగాణ పాలిసెట్ పరీక్ష రాయకపోయినా పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే నెల 20లోపు కుల, ఆదాయ, గార్డియన్ డెత్, బోనాఫైడ్, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, టెన్త్ మెమోను జత చేసి అమీర్‌పేటలోని బాలరక్ష భవన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో అందజేయాలని వివరించారు.

కుక్కల దాడి.. జింక మృత్యువాత

పూడూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో జింక మృతి చెందింది. ఈ సంఘటన పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో బుధవారం వెలుగులోకొచ్చింది. వివరాలిలా ఉన్నాయి. దామగుండం అడవిలో కుక్కలు ఓ జింకను కరిచి చంపాయి. గతంలోనూ జింకలను కుక్కలు చంపాయని, వన్యప్రాణులను రక్షించేందుకు అధికారులను చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.


జింకపిల్ల కళేబరం

రాజ్యమేలుతున్న రాజ్యాంగేతర శక్తులు

తాండూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగేతర శక్తులు రాజ్యమేలుతున్నాయని కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్ అన్నారు. బుధవారం తాండూరులోని అంబేడ్కర్ చౌక్ వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన జాతర సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ప్రైవేట్‌రంగం 85శాతానికి పెరిగిందని, అందులో రిజర్వేషన్లు కల్పించకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. ప్రైవేట్ రిజర్వేషన్లకు మహోద్యమం చేయాలన్నారు. జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్‌లు ఉన్నంత వరకు మనువాదానికి వ్యతిరేకంగా ప్రతిఘటన ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. యువత సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, ఉపాధ్యక్షులు మహిపాల్, సురేష్, వివిధ సంఘాల నాయకులు రాజు, శ్రీనివాస్,బుగ్గప్ప,ఆనంద్‌కుమార్, గోపాల్, చంద్రయ్య, శ్రీనివాస్, బలరాం, రఘుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.


జన జాతర సభలో అభివాదం చేస్తున్న పసునూరి రవీందర్, సంఘాల నాయకులు

ప్రధానోపాధ్యాయుడికి ఇండో గ్లోబల్ అవార్డు

దోమ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ.షఫీకి ఇండో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెస్టివల్-2025 అవార్డును అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లో సినీ నటుడు తనికెళ్ల భరణి, గ్లోబల్ మీడియా నెట్‌వర్క్ ఎడిటర్ ఇన్ చీఫ్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి నవీన్ మిట్టల్, వివిధ విద్యా సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, దోమ ఎంఈవో వెంకట్, ఉపాధ్యాయుడు వెంకటయ్య పాల్గొన్నారు.



తనికెళ్ల భరణి నుంచి అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం షఫీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

విడతలవారీగా 20వేల ఇళ్లు నిర్మిస్తాం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):విడతల వారీగా ఇబ్రహీం పట్నం నియోజకవర్గంలో 20వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. అర్హులను గుర్తించాలని ఇందిరమ్మ కమిటీలు, అధికారులకు సూచించారు. బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంప్ కార్యాలయంలో అధికారులు, ఇందిరమ్మ కమిటీలతో సమీక్ష నిర్వహించారు. మొదటి విడతగా 3,500 మందికి ఇళ్లు కట్టిస్తామని, త్వరగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పదేళ్లు పేదలను పట్టించుకోలేదని, గూడు లేనివారు ఇబ్బందులు పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మొదట సొంత స్థలం ఉండి ఇల్లులేని పేదలను గుర్తిస్తున్నామని, జాగలేని వారి విషయంలో త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ అబద్ధ ప్రచారాన్ని తిప్పికొటాలని కార్యకర్తలకు సూచించారు. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం వంటి ప్రజారంజక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, ఏఎంసీ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



బసవేశ్వరుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యే శంకర్, సంఘాల నాయకులు

కారణజన్ముడు.. బసవేశ్వరుడు

నందిగామ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బసవేశ్వరుడు కారణ జన్ముడని, ఆ రోజుల్లోనే ఆయన కులవివక్షను రూపుమాపేలా పాలించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం నందిగామలో లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. బసవేశ్వరుడు సామజిక విప్లవకారుడని, కులవ్యవస్థను నిర్మూలించి, సమాజంలో అసమానతులను తొలగించిన మహనీయుడని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, పి.రాములు, సి.నర్సింలు, బంట్రపు జంగయ్య, సుమన్, అంజూయాదవ్, కె.అంజయ్య, రవీందర్, కె.వెంకట్‌రెడ్డి, ఎం.యాదయ్య గౌడ్, రామస్వామిగౌడ్, సంఘ సభ్యులు బసవ లింగం, శేఖరప్ప, సతీష్, మహేష్, రవిశంకర్, శేఖర్, లింగం పాల్గొన్నారు.

మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని డీఆర్‌వో సంగీత. బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్‌రామ్ అన్నారు. బుధవారం బసవ జయంతిని ఘనంగా నిర్వహించారు. వారు మట్లాడుతూ.. మూఢనమ్మకాలపై బసవేశ్వరుడు నిరంతరం పోరాటం చేశారన్నారు. ప్రథమ సంఘ సంస్కర్త, మానవతావాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో సునిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రిటైరవుతున్న అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తేనే సంతృప్తి

వికారాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి నిజాయితీగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తే జీవితంలో ఎంతో సంతృప్తిని కలుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న షెడ్యూల్ కులాల అబివృద్ధి అధికారి మల్లేశం,యువజన సర్వీసులు, క్రీడల అధికారి హన్మంతరావు, యాలాల్ తహసీల్దార్ అంజయ్యలను ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసే అదృష్టం అందరికీ రాదని, ఆ అదృష్టం ప్రభుత్వ ఉద్యోగులకు రావడం గొప్ప విషయం అన్నారు. నిబద్ధతతో పనిచేసి అధికారులు, ప్రజల మన్ననలు పొందడం తృప్తి కలిస్తుందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం తమ శేష జీవితాన్ని కుటుంబంతో సంతోషంగా గడపాలని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వ్యవసాయ, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షాచౌదరి, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజస్, డీబీసీడబ్ల్యూవో ఉపేందర్, డీఎండబ్ల్యూవో కమలాకర్ రెడ్డి, డీపీవో జయసుధ, డీఈవో రేణుకాదేవి, దళిత సంఘాల నాయకులు, కుటుంబీకులు పాల్గొని శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు.



ఏఎస్ఐ హాషంను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

స్ఫూర్తిదాయకంగా విధుల నిర్వహణ

వికారాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హాషం పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి ఏఎస్ఐగా ఎదిగి, అంకిత భావంతో సేవలందించారని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం హాషం ఉద్యోగ విమరణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఎలాంటి మచ్చలేకుండా విధులు నిర్వహించడం సిబ్బందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. హాషం కుటుంబ సహకారం, త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రహదారికి తొలగిన అడ్డంకులు

▸▸ ఆటంకాలను క్లియర్ చేసిన హైడ్రా

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దేవరయంజాల్, కండ్లకోయ ప్రాంత ప్రజలు సులభంగా జాతీయ రహదారి 44కు చేరుకునే అవకాశాన్ని హైడ్రా కల్పించింది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న రహదారికి బండకుంట నరసింహారెడ్డి అనే వ్యక్తి గేట్లు పెట్టి, రోడ్డును కొంత తవ్వేసి ఆటంకాలు సృష్టించాడు. దీంతో గతంలో గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో బుధవారం హైడ్రా వాటిని తొలగించింది. షామీర్‌పేట మండలం దేవరయంజాల్‌కు రోడ్డును హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ప్రస్తుతం మట్టి రోడ్డు ఉండగా.. త్వరలో 40అడుగుల వెడల్పుతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మించనున్నారు. రోడ్డుకు ఆటంకాలు సృష్టిస్తున్నారని స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించి రాళ్లను తొలగించింది.

పదవుల పందేరం!

(మొదటి పేజీ తరువాయి)

మంది పేర్లు వినిపిస్తున్నప్పటికీ సీనియార్టీతో పాటు అందరిని కలుపుకుపోయే మనస్తత్వం, ఆర్థిక, అంగబలం ఉన్న నేతలకు పగ్గాలు అప్పగించాలని అధినాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

2017 నిబంధనతో..

రంగారెడ్డి డీసీసీ రేసులో పార్టీ సీనియర్ నేతలు మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన దేప భాస్కర్‌రెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, శంషాబాద్‌కు చెందిన రాచమళ్ల సిద్ధేశ్వర్, వేణుగౌడ్ తదితరులు పోటీలో ఉన్నారు. వికారాబాద్ డీసీసీ అధ్యక్ష రేసులో సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రఘువీరారెడ్డి, లాల్ కృష్ణ ప్రసాద్, ధారాసింగ్, కిషన్ నాయక్ పోటీలో ఉండగా రఘువీరారెడ్డికి అధ్యక్ష పీఠం దక్కే అవకాశాలు మెండుగా ఉన్నట్లు సమాచారం. మేడ్చల్ డీసీసీ అధ్యక్ష రేసులో హరివర్ధన్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్ పోటీ పడుతున్నారు. 2017 నిబంధన కూడా మరికొందరికి ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉందనే చర్చ జరుగుతోంది. ఈ నిబంధనతో కొత్తగా పార్టీలో చేరిన వారి ఆశలు నెరవేరే పరిస్థితి లేదన్న చర్చ జరుగుతోంది. మొత్తంగా కాంగ్రెస్ పదవుల పంపకాల్లో ఎవరికి ఏ పదవి దక్కుతుందో అనే ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది.

సీనియర్లకే ప్రాధాన్యం

కాంగ్రెస్ ఈ సారి ఎన్నికల్లో కొత్త ట్విస్ట్ ఇచ్చింది. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈసారి సంస్థగత ఎన్నికల్లో అధిష్ఠానం కొత్త మెలిక పెట్టింది. 2017, అంతకు ముందు నుంచి పార్టీలో పని చేస్తున్న వారికి పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉండి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నేతలకు సూచించారు. ఈ విషయంలో కచ్చితంగా అమలు చేయాలని ఆమె నేతలకు స్పష్టంగా తెలిపారు. దీంతో సీనియర్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తవారు పార్టీలో చేరి పెత్తనం చెలాయిస్తున్నారని తామేమి చేయాలని మదనపడుతున్న సీనియర్లకు ఈ నిర్ణయం కొండంత అండగా నిలిచింది. మండల, బ్లాక్ గ్రామ కమిటీలలో సీనియర్‌లకు ప్రాధాన్యత పెరుగుతుందని భావిస్తున్నారు. కీలక పదవులు సీనియర్లకు దక్కే అవకాశం కూడ ఉంది. ముఖ్యంగా ప్రతిపక్షంలో ఉండి బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పదేళ్లు పార్టీ కోసం పని చేసిన నేతలకు పదవులు దక్కేలా చూడాలని ఇందుకు నాయకులు గుర్తించాలని కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగళ్ల కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం పౌర సరఫరాల శాఖ మంత్రి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, గోడౌన్‌లు అందుబాటులో ఉన్నాయని, అంచాన మేరకు సరిపడా గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం కలెక్టర్ ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతీ రోజు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుగుణబాయి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బతుకులు దుర్భరమే..

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

కొత్తూర్/ మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాత్రింబవళ్లు యంత్రాల మధ్య పనిచేస్తూ ప్రజలకు వినియోగ వస్తువులను తయారు చేస్తున్న కార్మికుల బతుకులు నానాటికీ దుర్భరంగా మారుతున్నాయి. ప్రతి సంవత్సరం ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను జరుపుకుంటున్నా.. కార్మికులు మాత్రం కనీస వేతనాలు, సౌకర్యాలు, భద్రతకు నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు కార్మిక చట్టాలు చేస్తున్నా వాటిని పారిశ్రామిక వేత్తలు పాటించడం లేదు. చట్టాలను కాలరాస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

జిల్లాలో వెయ్యికిపైగా పరిశ్రమలు

రంగారెడ్డి జిల్లాలోని వెయ్యికిపైగా వివిధ పరిశ్రమలున్నాయి. 1976లో ప్రభుత్వం కొత్తూర్ సమీపంలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేసింది. కొత్తూర్, తిమ్మాపూర్, కొడిచర్ల, పెంజర్ల, ఇన్ముల్‌నర్వ, నందిగామ మండలం రంగాపూర్, మేకగూడ, చేగూర్ గ్రామాల్లో పరిశ్రమలు విస్తరించాయి. అలాగే ఫరూఖ్‌నగర్, ఎలికట్ట, బూర్గుల, కొందుర్గు మండలాల్లో, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లోనూ పరిశ్రమలు నెలకొల్పారు.

60వేల మంది కార్మికులు

జిల్లాలోని పరిశ్రమల్లో 60వేలకుపైగా మంది కార్మికులు పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. కొత్తూర్ పారిశ్రామికవాడలోనే 10వేల మంది కార్మికులున్నారు. రాష్ట్ర కార్మికులతో పాటు ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంచల్, ఒరిస్సా, రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్నారు. వీరిలో 30శాతం మందే పర్మనెంట్ కాగా, మిగతా వారంతా కాంట్రాక్ట్, క్యాజువల్ లేబర్‌గా ఉన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, చట్టప్రకారం వర్తించే ఇతర ప్రయోజనాలు వర్తించడం లేదు. భవన నిర్మాణ రంగ కార్మికులు మేస్త్రీలు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, వడ్రంగి, వెల్డర్, పెయింటర్ తదితర 54రకాల అసంఘటితరంగ కార్మికులు పనిచేస్తున్నారు. 1996లో ప్రభుత్వం నిర్మాణ, ఇతర రంగాల కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 11రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అయితే 60శాతం మందికి గుర్తింపు కార్డులు లేక ప్రయోజనం పొందడంలేదు.

కనీస వేతనాలు, వసతులు కల్పించాలి



కార్మిక చట్టాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. కార్మికులకు కనీస వేతనాలు, మౌలిక వసతులు, విశ్రాంతి, కేఫ్‌టేరియా/క్యాంటీన్లు, మంచినీరు, అంబులెన్స్, ట్రాన్స్‌పోర్టు వసతులను కల్పించడం లేదు. మహిళలు మరింతగా శ్రమదోపిడీకి గురవుతున్నారు. కార్మిక శాఖ అధికారులు తగిన చర్యలు తీసకోవాలి.

- బీస సాయిబాబ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు



కొత్తూర్: సేఫ్టీ పరికరాలు లేకుండా పనిచేస్తున్న కార్మికుడు

చాలీచాలని వేతనాలు

స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులకు నిబంధనల ప్రకారం వేతనాలు అందడం లేదు. లేబర్ యాక్ట్ ప్రకారం 20మందికిపైగా కార్మికులు పనిచేసే పరిశ్రమలో ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. అయితే యజమానులు కొందరికే సౌకర్యాలు వర్తింపజేస్తున్నారు. తక్కువ వేతనంతో పనిచేయించుకుంటున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, జీవన ప్రమాణ స్థాయిని బట్టి వేతనాలను నిర్ధారించాల్సి ఉంది.

గాలిలో దీపంలా కార్మికుల భద్రత..

కార్మికులకు పనిప్రదేశాల్లో భద్రత కరువైంది. హీట్ రెసిస్టెంట్ యాప్రాన్లు, గమ్‌షూ, హెల్మెట్లు, గ్లౌజులు, సెఫ్టీ బెల్టులు యాజమాన్యాలు ఇవ్వడం లేదు. ఫ్యాక్టరీ ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న వారి కుటుంబాలకు నామమాత్ర పరిహారమిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అన్‌స్కిల్డ్ లేబర్‌తో తక్కువ వేతనంతో పని చేయిస్తున్నారు. కార్మికులకు ఇళ్లు, విశ్రాంతి గదులు లేవు. మహిళా కార్మికుల ఇబ్బందులు అనేకం. రాత్రి పూట విధులు ముగించుకొని వెళ్లే వారికి ట్రాన్స్‌పోర్టు సౌకర్యం లేదు. యజమానులు పరిశ్రమల సమీపంలో రేకులగదులు నిర్మించి వదిలేస్తున్నారు.

మే డేలు ఎన్నొచ్చినా...

▸▸ అదే శ్రమదోపిడీ!

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా కార్మిక శ్రమ దోపిడీ ఆగడం లేదు. మేడ్చల్ జిల్లాలోని వివిధ ఇండస్ట్రియల్ ఏరియాలకు కార్మికులు వస్తున్నారు. అయితే వారికి సౌకర్యాలు కల్పించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. జీడిమెట్ల, షాపూర్‌నగర్, మేడ్చల్, నాచారం, ఉప్పల్, మౌలాలీ వంటి కారిడార్లు, ఔటర్ రింగ్ రోడ్డు సమీప గోదాముల్లో వేలాది మంది పనిచేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి సైతం వేలల్లో కార్మికులు పనిచేస్తున్నారు. చాలా మంది క్యాజువల్ లేబర్‌గానే ఉన్నారు. ఫార్మా, ఐరన్ వంటి ప్రమాదకర పరిశ్రమల్లో వారికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. లేబర్ కాంట్రాక్టర్ల కింద పనిచేస్తున్నారు. ప్రతీ కార్మికుడిపై కమీషన్ తీసుకుంటూ కాంట్రాక్టర్లు, పరిశ్రమల యాజమానులు శ్రమ దోపిడీ చేస్తున్నారు. 12గంటలు పనిచేయించుకుంటూ ఓటీ కూడా ఇవ్వడం లేదు. కాగా కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన సంఘాలు యాజమాన్యాలకు తొత్తుల్లా మారుతున్నారనే ఆరోపణలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

కష్టానికి తగిన ప్రతిఫలం లేదు



రోజంతా పనిచేస్తున్నా సరిపడా వేతనం అందడం లేదు. 8గంటల పనికని పలిచి 12గంటలు పని చేయించుకుంటున్నారు. కనీస సౌకర్యాలు లేకుండా ఉదయం 6 నుంచి సాయంత్రం 6వరకు చాకిరీ చేయిస్తున్నారు.

- నమ్ము సదా, మేడ్చల్ పారిశ్రామికవాడ

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం గౌతాపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించొచ్చని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పంచాయతీలో సీసీ కెమెరాలను ఎస్ఐ విఠల్‌రెడ్డితో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో మల్లికార్జునాలయం వద్ద ఓ బాలుడిని కిడ్నాప్ చేయగా, అలాగే ఇదే ప్రాంతంలో గొర్రెలును అపహరించగా సీసీ కెమెరాల ఫుటేజీలతో కేసులను ఛేదించామన్నారు. చౌరస్తాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతో సంఘటనలపై త్వరగా వివరాలు సేకరించగలుగుతామన్నారు. దుకాణాల్లో, ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి, గ్రామపెద్ద రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు రాంచంద్రారెడ్డి, మల్లారెడ్డి, శకుంతల, పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ తదితరులున్నారు. అనంతరం డీఎస్పీ, ఎస్ఐ, రాంరెడ్డిలను గ్రామస్తులు సన్మానించారు.

ఔత్సాహికులను ప్రోత్సహించాలి

వికారాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వ్యాపారం చేసేందుకు ముందుకొచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్యాక్స్‌ల కంప్యూటరైజేషన్, నూతన పెట్రోల్ పంపులు, ఎల్పీజీ, మత్స్యసంఘాలు, డెయిరీ ఫాంలు, గోదాముల ఏర్పాటు తదితరాంశాలపై జిల్లా సహకార, బ్యాంకుల అధికారులతో అదనపు కలెక్టర్ సుధీర్‌తో కలిసి సమీక్షించారు. లింగ్యానాయక్ మాట్లాడుతూ.. సహకార రంగ బలోపేతానికి నిరుద్యోగులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు చెప్పారు. కొత్తగా వ్యవసాయ సహకరా సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదన వచ్చాయని తెలిపారు. కొత్త పెట్రోల్ పంపుల మంజూరు, ఇప్పటికే ఉన్న పెట్రోల్ పంపుల మార్పిడిపై దృష్టిసారించాలని తెలిపారు. జన ఔషధి కేంద్రాలు, కిసాన్ సమృద్ధి కేంద్రాల ఏర్పాటుకు కృషిచేయాలని సూచించారు. నేషనల్ కో-ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్, కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్, భారతీయ బీజ్ సహకార్ సమితి లిమిటెడ్‌లు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి నాగార్జున, నాబార్డ్ డీడీఎం అఖిల్,సెంట్రల్ బ్యాంక్ సీఈవో సుబ్రహ్మణ్యం, పశుసంవర్ధక, వ్యవసాయ అధికారులు సదానందం, పద్మావతి పాల్గొన్నారు.

కూచిపూడిలో బాలిక గిన్నిస్ రికార్డు



వరల్డ్ రికార్డు పత్రాన్ని అందుకుంటున్న చైత్ర

చేవెళ్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ గ్రామానికి చెందిన బాలిక చట్లపల్లి చైత్ర కూచిపూడి నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. మహేందర్-శ్వేతల కుమార్తె చైత్రకు హైదరాబాద్‌లోని నాట్య గురువు కోవిద కాంతారావు, సాయి కూచిపూడి నృత్యం నేర్పించారు. 24 డిసెంబర్ 2023న హైదరాబాద్‌లోని భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో చైత్ర తన నృత్యంతో శభాష్ అన్పించుకుంది. అప్పట్లో దీనిపై వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకులు వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ నెల 2న చైత్ర నృత్య ప్రదర్శన బాగుందని కితాబిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎంపిక చేశారు. 29న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో చైత్రకు రికార్డు పత్రాన్ని అందజేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు రావడం తనకు సంతోషంగా ఉందని చైత్ర తెలిపింది.

టెన్త్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


సంజన(562), గురుకులం, కొత్తగడి


వడ్ల అక్షర (562), జడ్పీహెచ్ఎస్, చెన్‌గోముల్


వి.సుప్రియ (559), బాలికల రెసిడెన్షియల్ స్కూల్, పరిగి


నదీమ్, (555), మైనార్టీ గురుకుల బాలుర, వికారాబాద్


ఈశ్వర్, (553) గిరిజన పాఠశాల, బండవెల్కిచర్ల


బి.వర్షిణి, (554) బాలికల రెసిడెన్షియల్ స్కూల్, పరిగి


సారా బేగం, (547) మేడిపల్లి కలాన్

వికారాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల విద్యార్థి హరిణి 573 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. వికారాబాద్ పరిధిలోని 23పాఠశాలలో 790 మంది విద్యార్థులకు 550 మంది ఉత్తీర్ణత సాధించారు. కాగా ఉత్తీర్ణత శాతంలో సైతం 97.33 సాధించి మొదటి స్థానంలో నిలిచింది. పులుసుమామిడి హైస్కూల్‌లో 30శాతం మార్కులతో చివరి స్థానంలో నిలిచింది.

పరిగి: మండలంలో 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 515 విద్యార్థులు పరీక్షలు రాయగా 270 విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 52శాతం ఉత్తీర్ణత సాధించారు. పరిగిలోని ఐదు రెసిడెన్షియల్ పాఠశాలల్లో 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ఎనిమిది ప్రైవేట్ పాఠశాలలో 92శాతం ఉత్తీర్ణత సాధించారు. పరిగి మండలంలోని ఎనిమిది ప్రైవేట్ పాఠశాలల్లో 92 శాతం ఉత్తీర్ణత సాధించారు. పరిగి జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియన్‌లో విద్యార్థులు జె.చిన్మయి 568, వి.సుప్రియ 559, బి.వర్షిణి 554మార్కులు సాధించారు.

కొడంగల్/దుద్యాల: పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాల విద్యార్థులు మహీన్‌ఫాతీమా 557, సాయిశ్రీ 547, వైష్ణవి 520, బిందు 518 మార్కులతో ప్రతిభ కనబర్చారు. ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్ వారిని అభినందించారు. దుద్యాల మండలంలో ఇంగ్లీష్ మీడియంలో విద్యార్థిని శివాని 537 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

బషీరాబాద్: మండలంలో 60.2శాతం ఉత్తీర్ణత నమోదైంది. జడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు) విద్యార్థిని ఎక్మాయికి చెందిన పి.భావన 549మార్కులతో టాపర్‌గా నిలిచింది. అదే పాఠశాల విద్యార్థిని సాలేహ 533 మార్కులతో ద్వితీయ, కేజీబీవీ విద్యార్థిని నవనీత తృతీయ స్థానంలో నిలిచారు.

తాండూరు రూరల్: మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్‌లో సాత్విక 561మార్కులు కరన్‌కోట్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐశ్వరయ్య 521, తాండూరులోని ప్రభుత్వ నెంబర్‌లో తెలుగు మీడియంలో సాదియా ఖాతూన్ 535 మార్కులతో ప్రతిభ కనబర్చినట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. తాండూరు మండల పరిధిలోని మోడల్ స్కూల్‌లో 91శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని కస్తూర్బా కస్తూర్బ బాలికల విద్యాలయంలో 86శాతం ఉతీర్ణత సాధించారు.

మర్పల్లి: మాడల్ స్కూల్ విద్యార్థిని శ్రీవాణి అమూల్య 527 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మండలంలో 76 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో అంజిలయ్య తెలిపారు.

మోమిన్‌పేట్: మండలంలోని ఎన్కతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మండల టాపర్‌గా 512 మార్కులతో హరిక నిలిచారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సుహాన ఫాతీమా 510 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. మొత్తం 323 మంది విద్యార్థుల్లో 236 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మల్లేశం తెలిపారు.

నవాబుపేట: మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో 66 మందిలో 60 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి స్థానంలో కార్తీక్ 582, ద్వితీయ స్థానంలో దినేశ్ 564 మార్కులు సాధించారు.

జడ్పీహెచ్ఎస్‌లో 167 మందికి 108 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల స్థాయిలో శ్రీహర్ష 535, ద్వితీయ స్థానంలో ఎల్లకొండ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన సాదీయాబేగం 515 మార్కులు సాధించారు. కేజీబీవీలో 53 మందికి 36 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు టీఎస్‌యంఎస్ బాలుర పాఠశాలలో మొత్తం 66 మందిలో 37మంది ఉత్తీర్ణత సాధించారు.

బంట్వారం: మండలంలో 281 మంది విద్యార్థులకు 181మంది ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్ రావు బుధవారం ఓ ప్రకటంలో తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని గొల్ల మధుప్రియ 554 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.

దోమ: మండలంలో 448 మంది విద్యార్థులకు 344 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిచారు. బడెంపల్లి పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా దిర్సంపల్లి పాఠశాల చివరి స్థానంలో నిలిచింది. దోమ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన సంధ్య 531మార్కులు(మండల టాపర్), దాదాపూర్ పాఠశాల విద్యార్థిని అనిత 520మార్కులు సాధించారు.

చౌడాపూర్: మండలంలో మొత్తం 262 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 182 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లీష్ మీడియంలో 523 మార్కులతో విష్ణు మోహనచారి మొదటి స్థానం, 517 మార్కులతో అనూపమ ద్వితీయ స్థానం సాధించారు.

ధారూరు: మండలంలోని 9 ఉన్నత పాఠశాలల్లో 79.79శాతం ఉత్తీర్ణత సాధించారు. నాగారం ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు మీడియం విద్యార్థిని జి.వైష్ణవి 523మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. కుక్కిద ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.లావణ్య 520మార్కులు, హర్షవర్ధన్ 513మార్కులు సాధించారు. గతేడాదితో పోల్చుకుంటూ ఈ సారి ఉత్తీర్ణత శాతం రెట్టింపయింది.

యాలాల: మండలంలో 79.42శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్లో కె.నవ్య 534, గౌతమి మోడల్ స్కూల్‌లో హారిక 554, కె.కార్తిక్ 544 మార్కులతో ప్రతిభ కనబర్చారు.

కొడంగల్: కొడంగల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు 128మందిలో 111మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల టాపర్‌గా విద్యార్థి అశోక్ 497 మార్కులు సాధించాడు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో అబ్దుల్ బాసిత్ 578, జాబీన్ 568 అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మక్సూద్ అలీ తెలిపారు.

దౌల్తాబాద్: గోకఫస్లాబాద్ జడ్పీహెచ్ఎస్‌లో 51 మంది విద్యార్థులకు 45 మంది, చల్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో 46 మందికి 41, బిచ్చాల్ జడ్పీహెచ్ఎస్‌లో 16 మందికి 12, బాలంపేట్ జడ్పీహెచ్ఎస్‌లో 49 మందికి 45, దౌల్తాబాద్ జడ్పీహెచ్ఎస్‌లో 94 మందికి 86, చంద్రకల్ జడ్పీహెచ్ఎస్‌లో 13 మందికి 9, కేజీబీవీ దౌల్తాబాద్‌లో 42 మందికి 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 147 మంది పరీక్షలు రాయగా 132 మంది ఉత్తీర్ణత సాధించారు.

కులకచర్ల: మండలంలో 772 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 369 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బండవెల్కిచర్ల గిరిజన పాఠశాల విద్యార్థి ఈశ్వర్ 553మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు.

కోట్‌పల్లి: పది ఫలితాల్లో మండలంలో 78శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. మండల టాపర్‌గా కస్తూర్బాగాంధీ బాలికలపాఠశాల విద్యార్థిని హర్షిత 501మార్కులు సాధించింది.

పూడూరు: మండల పరిధిలోని చెన్‌గోముల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వడ్ల వి.అక్షర 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన సారా బేగం 547, కంకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.ప్రకాష్ 539, పూడూరు టీఎస్ఎంఎస్‌కు చెందిన బి.తేజశ్రీ 539మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.

జిల్లా టాపర్లుగా తాండూరు విద్యార్థులు


ముజ్నా అకీల్


పటేల్ అమూల్య


సాహిత్‌రెడ్డి

తాండూరు: పదోతరగతి ఫలితాల్లో సెయింట్ మార్క్స్ హైస్కూల్‌కు చెందిన ముజ్నా అకీల్, కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌కు చెందిన పటేల్ అమూల్య 586 మార్కులు సాధించి జిల్లాలోనే టాపర్లుగా నిలిచారు. కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రశాంత్, డైరెక్టర్ సతీష్‌లు పటేల్ అమూల్యను అభినందించారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఎస్.నిహారికగౌడ్ 578మార్కులు, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన పట్లోళ్ల సాహిత్‌రెడ్డి 582 మార్కులు, అక్షర కాన్సెప్ట్ స్కూల్‌కు చెందిన యువసి 523 మార్కులు సాధించారు. విశ్వవేద హైస్కూల్ విద్యార్థి 548మార్కులు సాధించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

ఘట్‌కేసర్: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 75.26శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 64.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎం.దీరజ్ 510 మార్కులు సాధించాడు. ఘట్‌కేసర్‌లోని జడ్పీ బాలికల పాఠశాలలో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ జడ్పీ పాఠశాలలో 75శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ ఉప్పల్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. శివ 558, హేమంత్ 545, చైతన్య 543మార్కులు సాధించారు. మేడ్చల్ జిల్లాలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 95శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు గురుకుల పాఠశాలల డీసీవో వేణుగోపాల్ తెలిపారు. ఎదులాబాద్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించి ఘట్‌కేసర్ మండలంలో నే మొదటి స్థానంలో నిలిచింది. అంకుశాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల 81.82, ప్రతాప్‌సింగారం పాఠశాల 79.69శాతం, కొర్రెముల పాఠశాల 64.89 శాతం, ఎదులాబాల్ బాలుర పాఠశాల 86.05 శాతం, అవుశాపూర్ పాఠశాల 46.67 శాతం సాధించాయి. మండల టాపర్‌గా జిల్లా పరిషత్ ఎదులాబాద్ బాలిక పాఠశాల విద్యార్థిని బి.ప్రవళిక 541మార్కులు, జి.చందన 527, కొర్రెముల పాఠశాలకు చెందిన అన్మోల్ తరంగ్ 525 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.


సాయి కిరణ్ (555) కీసరగుట్ట గురుకుల


కీర్తి (542), జడ్పీ ఉన్నత, లాల్‌గడి మలక్‌పేట,

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 82శాతం ఉత్తీర్ణతను సాధించారు. మొత్తం 147మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 117మంది ఉత్తీర్ణత సాధించారు. నాగారం మున్సిపాలిటీలో జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 83శాతం ఉత్తీర్ణత సాధించారు. రాంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని కె.అక్షయ 515మార్కులు సాధించింది. నాగారంలోని సెరినిటీ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ధనుంజయ నాయుడు అనే విద్యార్థి 582 మార్కులు సాధించాడు. తునిత 579, గౌరి 574, సాయి అనువి 568, లలిత 566, తన్వి 566, ధనశ్రీ 557, నీహెచ్ రోజి 556, పవిత్ర 556 మార్కులు సాధించారు. 61మంది పైగా విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అభినందించారు.

శామీర్‌పేట: టెన్త్ ఫలితాల్లో మండల విద్యార్థులు 77శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కమలాకర్ తెలిపారు. మండలంలో 315 మంది విద్యార్థులకు 243 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పొనాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో వందశాతం,శామీర్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 41 మందికి 34మంది ఉత్తీర్ణులయ్యారు. తూంకుంట హైస్కూల్ నుంచి 63 మంది విద్యార్థులు పరీక్షలను రాయగా 50 మంది ఉత్తీర్ణులయ్యారు. అలియాబాద్ హైస్కూల్ నుంచి 42 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 34 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని లాల్‌గడి మలక్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కీర్తి 542 మార్కులను సాధించి మండలంలో టాపర్‌గా నిలిచింది. తూంకుంట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని లహరి 536మార్కులు సాధించారు.

కీసర: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కీసరగుట్ట గురుకుల పాఠశాల విద్యార్థులు 95.78 ఉతీర్ణత శాతం సాధించారు. అందుల్లో 18 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారు. సాయి కిరణ్ 555 మార్కులతో పాఠశాల మొదటి స్థానంలో నిలిచారు.

సంక్షిప్తంగా..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు

మేడ్చల్ టౌన్: కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం కలెక్టర్‌ను కలిసి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతో ప్రజలు పడుదుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ మేరకు మేడ్చల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల పరిషత్ కార్యాలయం వద్దకు తరలించడానికి కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

పరిగి: మే 7 నుంచి నిర్వహించ తలపెట్టిన ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె పోస్టర్‌ను బుధవారం ఆర్టీసీ జేఏసీ కో-చైర్మన్ కె.హన్మంత్‌ముదిరాజ్ పరిగి డిపోలో ఆవిష్కరించారు.

వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

పరిగి: జడ్పీహెచ్ఎస్‌నెం.01 పాఠశాలలో స్పోర్ట్స్ పౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ బుధవారం వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

వేతనాలు చెల్లించాలి

కోట్‌పల్లి: మండలంలో జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని బుధవారం కోట్‌పల్లి ఎంపీడీవో దానియల్ కు ఉపాధిహామీ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు.

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

తాండూరు: జాతీయ జనగణనలో భాగంగా సమగ్ర కుల గణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర బీసీ యువజన సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మరోమారు ఎల్‌ఆర్ఎస్ రాయితీ గడువు పెంపు

తాండూరు: స్థలాల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్ఎస్) కింద ప్రభుత్వం ఇచ్చిన రాయితీ గడువును మరోసారి పొడిగించింది. ఈనెల 3వ తేదీ వరకు మరోసారి గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు రికవరీ

తాండూరు రూరల్: కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి బాధితులకు అప్పగించారు. రూరల్ సీఐ నాగేష్, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ ప్రవీణ్‌కుమార్, కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ దేవాలయం పూజారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కీసర రూరల్: కశ్మీర్, పహల్గామ్ మృతులకు నివాళిగా బుధవారం మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని క్రాంతికిన్ అకాడమీ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సొసైటీ సమక్షంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 240మంది రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్ విచ్చేశారు.

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి

యాలాల: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఆర్బీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. యాలాల తహసీల్దార్‌గా పనిచేసిన అంజయ్య బుధవారం పదవీ విరమణ పొందారు. ఆయన సన్మాన కార్యక్రమాన్ని మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో బుధవారం నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఘట్‌కేసర్ రూరల్/బొంరాస్‌పేట్: అవుశాపూర్‌కు చెందిన రామకృష్ణ కుటుంబసభ్యులకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ బుధవారం రూ.27,500వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. అంతకుముందు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపును ప్రారంభించారు. బొంరాస్‌పేట్ మండలంలోని మేడిచెట్టు తండా పరిధిలోని బోరబండ తండాకు చెందిన బాలునాయక్‌కు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.50వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు బుధవారం అందజేశారు.

కేంద్రంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

ధారూరు: ధారూరుకు చెందిన మాజిద్ అనే వ్యక్తి బీజేపీ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని బుధవారం బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వాన్ని దూషిస్తూ పోస్టులు చేశాడని ఎస్ఐ అనితకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు.

'పది'లో మరో'సారీ'!

(మొదటి పేజీ తరువాయి)

బాలికలు 78.14 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలుర కంటే బాలికల 8.37 శాతం ఉత్తీర్ణత అధికంగా ఉండడం గమనార్హం. గత రెండేళ్లతో పోలిస్తే జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత 14.51 శాతం పెరిగినా రాష్ట్రంలో మాత్రం అట్టడుగు స్థానంతోనే సరిపెట్టుకుంది.

జిల్లాలో బొంరాస్‌పేట్ టాప్...

జిల్లాల ఫలితాల్లో కొడంగల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మొదటి వరుసలో నిలిచాయి. బొంరాస్‌పేట్ 93 శాతం శాతం ఉత్తీర్ణత సాధించి అగ్రస్థానంలో నిలువగా, దుద్యాల్ మండలం 88 శాతం, దౌల్తాబాద్ 87 శాతం, కొడంగల్ 84 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ధారూరులో 80 శాతం, యాలాల్‌లో 79 శాతం, వికారాబాద్ 79 శాతం, తాండూరు 78 శాతం, మోమిన్‌పేట్ 78 శాతం, కోట్‌పల్లి 78 శాతం, దోమ 77 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నాయి. చౌడాపూర్ 75 శాతం, మర్పల్లి 74 శాతం, పరిగి 73 శాతం, పూడూరు 71 శాతం, నవాబ్‌పేట్ 67 శాతం, బంట్వారం 64 శాతం, బషీరాబాద్ 64 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అత్యల్పంగా కులకచర్ల, పెద్దేముల్ మండలాలు 47 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నాయి.

టీజీ గురుకులాలు టాప్

పదో తరగతి ఫలితాల్లో తెలంగాణ గురుకుల పాఠశాలలు తమ సత్తా చాటుకున్నాయి. జిల్లాలో 96 శాతం ఉత్తీర్ణత సాధించాయి. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు 93 శాతం, బీసీ సంక్షేమ గురుకులాలు 92 శాతం, ప్రైవేట్ పాఠశాలలు 88 శాతం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు 86 శాతం, మైనార్టీ గురుకులాలు 84 శాతం, ఎయిడెడ్ పాఠశాలలు 83 శాతం, కేజీబీవీ పాఠశాలలు 70 శాతం, ప్రభుత్వ పాఠశాలలు 65 శాతం, జెడ్పీ ఉన్నత పాఠశాలలు 64 శాతం, ఆశ్రమ పాఠశాలలు 63 శాతం, మోడల్ పాఠశాలలు 62 శాతం ఉత్తీర్ణత సాధించాయి. వివిధ యాజమాన్య పాఠశాల్లో బాలికలు 78 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 70 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నారు.

8 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం

ఈసారి జిల్లాలో మొత్తం 18 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకున్నాయి. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, ప్రైవేట్ పాఠశాలలు 10 చొప్పున వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. బొంరాస్‌పేట్ కేజీబీవీ, బురాన్‌పూర్, కొడంగల్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలు, కోకట్‌లోని టీజీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఎన్నారం, కోటమర్పల్లి, రాస్నం, చీమల్‌దరిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నారు.

పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణం..

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వికారాబాద్ జిల్లా మూడేళ్ల నుంచి వరుసగా రాష్ట్రంలో చివరి స్థానంలో నిలవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో మెరుగైన ఫలితాలు రాకపోవడానికి విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమనేది తెలుస్తోంది. విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతున్నాయనేది ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పరిశీలించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో పురోగతి సాధించేందుకు తరచూ సమీక్షలు నిర్వహించే జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు విద్యాశాఖపై ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల పనితీరుపై నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో పూర్తిగా చివరన నిలవడం చర్చనీయాంశంగా మారింది.

మేడ్చల్‌లో ప్రభుత్వ విద్యార్థులదే హవా

- ఉత్తీర్ణతలో బాలికల ముందంజ
- 90.76శాతంతో 28వ స్థానంలో జిల్లా

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పది పరీక్ష ఫలితాల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటారు. జిల్లాలో 90.76 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా రాష్ట్రంలో జిల్లా 28వ స్థానంలో నిలిచింది. గతేడాది కంటే ఒకస్థానం పడిపోయింది. కాగా, బాలికలదే పై చేయిగా నిలిచింది. జిల్లాలో 896 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా 47,235 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 42,870 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 90.76 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 24,487 మంది బాలురులకు గాను 21,808 మంది, 89.06 శాతం ఉత్తీర్ణత సాధించారు. 22,748 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా 21,062 మంది 92.59 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మూడు పాఠశాలల్లో వందశాతం

మేడ్చల్ మండలం గిర్మాపూర్ జెడ్పీహెచ్ఎస్, శామీర్‌పేట్ మండలం పొన్నాల్ జెడ్పీహెచ్ఎస్, ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ జెడ్పీహెచ్ఎస్‌లు వంద శాతం ఫలితాలు సాధించాయి. అలాగే 24 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారు.

సంవత్సరాల వారీగా వికారాబాద్ జిల్లా ఫలితాలు

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం	రాష్ట్రంలో జిల్లా స్థానం
2018	75.39	26
2019	88.82	25
2022	90.42	24
2023	59.46	33
2024	65.10	33
2025	73.97	33

వివక్షపై పోరాడిన మహనీయుడు బసవేశ్వరుడు


వికారాబాద్: మహాత్మా బసవేశ్వరుడి ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

వికారాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని వర్ణ, వర్గ, లింగ వివక్షపై బసవేశ్వరుడు ఆ రోజుల్లోనే పోరాడారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మహాత్మా బసవేశ్వర జయంతి సందర్భంగా బుధవారం వికారాబాద్‌లోని ఎంఆర్‌పీ చౌరస్తాలోని బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మర్పల్లి: మండల కేంద్రంలో బసవేశ్వర జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములుయాదవ్ పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. వీరశైవ లింగాయత్ సంఘం మండల అధ్యక్షుడు విజయ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

బంట్వారం: మండల కేంద్రంలో బుధవారం ఘనంగా బసవేశ్వరుడి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాంత్ కుమార్, మల్లేశం పాల్గొన్నారు.

కోట్‌పల్లి: మండల కేంద్రంలో వీరసేవ సమాజ కార్యవర్గం సమక్షంలో బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. గౌరవ అధ్యక్షులు గండె సురేష్, సంగమేశ్వర్, మల్లేశం,దేశ్‌ముఖ్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ధారూరు: ధారూరు వీరభద్రేశ్వర ఆలయం నుంచి బసవేశ్వర విగ్రహం వరకు భక్తులు ఊరేగింపుగా వెళ్లి బసవేశ్వర విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

తాండూరు: తాండూరులోని ఇందిరా చౌక్‌లోని బసవేశ్వర విగ్రహానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరశైవ లింగాయత్, వీరశైవ యువదళ్ ఆధ్వర్యంలో బసవేశ్వరుని జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, ధారాసింగ్, లింగదళి, రవి కుమార్ పాల్గొన్నారు.

పరిగి: బసవేశ్వరుడు సామాజిక విప్లవకారుడని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. బసవేశ్వరుడి జయంతి సందర్భంగా బుధవారం పరిగిలోని బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

చౌడాపూర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బసవేశ్వర జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. చౌడాపూర్, మందిపాల్, మరికల్ గ్రామాల్లో బసవేశ్వర జయంతిని నిర్వహించారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసవేశ్వర చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

కొడంగల్: వీరశైవ సమాజం ఆధ్వర్యంలో మున్సిపల్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో బసవేశ్వరుడి చిత్రపటాలకు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాడిబావి శివాలయం నుంచి మహాదేవ శివాలయం మీదుగా నిరంజన మఠం వరకు వీరశైవ లింగబలిజ సమాజం ఆధ్వర్యంలో ఎడ్ల ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలో వీరశైవ సమాజం సభ్యులు బలభీమ సేన ఆలయం నుంచి దౌల్తాబాద్ చెరువు కట్ట వరకు నందికోల పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహాత్మా బసవేశ్వరుడి విగ్రహ భూమి పూజ నిర్వహించారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బసవేశ్వర చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, నర్సింహులునాయుడు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి


అర్చన(ఫైల్)

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పరీక్ష రాసి ఇంటికి వెళ్తున్న ఓ విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం నల్ల మడుగుల తండాకు చెందిన అర్చన(17) మంగళవారం తన సోదరుడు ధనావత్ హరివింద్‌తో కలిసి సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో టీజీఈఏపీసీఈటీ పరీక్ష రాసేందుకు వచ్చింది. పరీక్ష రాసిన అనంతరం కండ్లకోయలోని తమ బంధువుల ఇంటి వద్ద ఉండి బుధవారం ఉదయం బైక్‌పై తన సోదరునితో కలిసి వెళ్తుండగా మేడ్చల్ చెక్ పోస్టు సమీపంలో వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహన ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అర్చన తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. హరివింద్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో 9 మేకలు మృత్యువాత

పూడూరు, ఏప్రిల్ 30, (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో 9మేకలు మృత్యువాతపడ్డాయి. చీలాపూర్ గ్రామానికి యు.రామన్న తన మేకలను రోజు మాదిరిగా మంగళవారం రాత్రి కూడా షెడ్డులో వదిలాడు. ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సర్వీస్ వైర్ తెగిపడి షెడ్డుకు తగిలింది. మేకల షెడ్డుకు తగిలి విద్యుత్ షాక్ రావడంతో 9మేకలు మృత్యువాతపడ్డాయి. గమనించిన గ్రామస్తులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ లైన్ కట్ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి ఘనాపూర్‌లో లభ్యమైంది. ఘనాపూర్‌లో గ్యాస్ పైపులైన్ పక్కన గుర్తుతెలియని ఓ వ్యక్తి(40) మృతదేహం ఉన్న విషయాన్ని గమనించిన గ్యాస్ పైపులైన్ పెట్రోలింగ్ చేసే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు అనారోగ్యంతో గాని వడదెబ్బతో గాని మృతిచెందిన ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చౌడాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చౌడాపూర్ మండలంలోని మక్తా వెంకటాపూర్ గ్రామ సమీపంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి.

అసభ్యకర మెసేజ్ చేశాడని ఫిర్యాదు

నవాబుపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అసభ్యకర మెసేజ్ పెట్టిన చేవెళ్ల నియోజకవర్గ యువ నాయకుడు ఉపేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, వైస్‌చైర్మన్ బలవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వారు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బలరాం, నర్సింహారెడ్డి, ఖదీర్, చాకలి లింగం, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి సంఘటనలో జైలు శిక్ష

కొడంగల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బుల్కాపూర్‌లో 2020 సంవత్సరంలో జంగంగారి శ్రీనివాస్‌రెడ్డి ఇంటి విషయంలో పాలేరైనా జంగంగారి సత్యనారాయణరెడ్డి రాడుతో తలపై దాడిచేయడంతో అప్పట్లో కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై జీవి.సత్యనారాయణ తెలిపారు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి కేసు దర్యాప్తుతో చార్జ్‌షీట్‌ను కొడంగల్ మున్సిఫ్ కోర్టులో దాఖలు చేయగా బుధవారం న్యాయమూర్తి వాదోపవాదలు విని సత్యనారాయణరెడ్డికి సంవత్సరం జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ జీవి.సత్యనారాయణ తెలిపారు.